


## రేపు కలెక్టరేట్ వద్ద వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఈనెల 28న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను వాలంటీర్లు జయప్రదం చేయాలని సిఐటియు రూరల్ మండల కమిటీ కన్వీనర్ టి.రాజా, కో కన్వీనర్ ఎం.వెంకటరమణ శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని, తక్షణమే వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవడంతోపాటు, రూ.10 వేలు వేతనాన్ని పెంపుదల చేయాలనే డిమాండ్‌తో ఎపి గ్రామ, వార్డు వాలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నాలో వాలంటీర్లు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. వాలంటీర్లను రాష్ట్ర ప్రభుత్వం విధుల్లోకి తీసుకునేంత వరకూ సిఐటియు వాలంటీర్ల పోరాటానికి అండగా ఉంటుందని అన్నారు.

# నిర్మాణ కార్మికుల గోడు పట్టదా.?

- వైసిపి పాలనలో సంక్షేమ బోర్డు నిధుల మళ్లింపు
- పరిష్కారానికి నోచుకోని పెండింగ్ క్లెయిములు
- కూటమి మంత్రి హామీ ఇచ్చినా తీరని సమస్య



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గత వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ రంగ కార్మికులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్లించి తీవ్ర అన్యాయం చేసింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపై నిర్మాణ కార్మికులు అనేక ఆశలు పెట్టుకున్నారు. తిరిగి మంచి రోజులు వస్తాయని ఆశిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు కావస్తున్నప్పటికీ సంక్షేమ బోర్డు నిధులపై నేటికీ ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో కార్మికులు నిట్టూర్పుతున్నారు.

నిర్మాణ రంగంపై ఆధారపడి కాకినాడ జిల్లాలో 2.50 లక్షల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. 2014 నుంచి 19 వరకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏపి భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అనేక పథకాలు కార్మికులకు చేరేవి. 2019 ఎన్నికల్లో జగన్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సంక్షేమ పథకాలను అటకెక్కించారు. దీంతో పెద్దఎత్తున కార్మికులు అనేక రూపాలలో సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించి జగన్ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని ఖండించారు. అయితే ఈ పోరాటాలు జరుగుతున్న సందర్భంలో టిడిపి నాయకులు కార్మికులకు భరోసా కల్పిస్తూ మేము అధికారంలోకి రాగానే సంక్షేమ బోర్డు పథకాలను అమలు చేస్తామని, జగన్ చేసిన నష్టాన్ని భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని 5 నెలల పాలనలో ఏమాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కార్మికశాఖ మంత్రి, రామచంద్రపురం ఎంఎల్ఎ వాసంశెట్టి సుభాష్‌ను సిఐటియు బృందం కలిసిన సందర్భంగా సంక్షేమ బోర్డు మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఆమోదిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ ఇచ్చి 5 నెలలు కావస్తున్నా అతీగతీ లేకుండా పోయింది. పలు దఫాలు కేబినెట్ సమావేశాలు జరిగినా సంక్షేమ బోర్డు ఊసెత్తకుండా కాలం గడుపుతున్నారని కార్మికులు వాపోతున్నారు.

**సంక్షేమ పథకాలు ఇలా అమలయ్యేవి**

నిర్మాణ రంగంలో 53 రకాల వృత్తుల వారున్నారు. తాపీమేస్త్రీ, కార్పెంటర్, ప్లంబర్, పెయింటర్, రాడ్ బెండింగ్, ఇసుక కార్మికులు, ఇటుకబట్టి కార్మికులు, టైల్స్ కార్మికులు, ఎలక్ట్రీషియన్స్ తదితర వృత్తులు కార్మికులు కార్మిక శాఖ వద్ద నామ మాత్రపు రుసుంతో పేర్లు నమోదు చేయించుకున్నారు. వీరికి ప్రమాదవశాత్తు చనిపోతే రూ. 5.20 లక్షలు, అనారోగ్యంతో సహజ మరణం చెందితే రూ.80వేలు, భార్య కూతురు ప్రసూతి సహాయం కాన్పుకి రూ.20వేలు చొప్పున రెండు కాన్పుల వరకు, ఇద్దరు కూతుర్ల వివాహానికి రూ.20వేలు ఒక్కొక్కరికి, హస్పిటలైజేషన్ అయితే మూడు నెలలకు రూ.9వేలు, ప్రమాదవశాత్తు శాశ్వత అంగవైకల్యం చెందితే రూ.5 లక్షల వరకూ సంక్షేమబోర్డు ద్వారా కార్మిక శాఖ కార్మికులకు చెల్లించేది. 2014 నుంచి 2019 వరకూ ఇవి అమలయ్యాయి.

**సంక్షేమ నిధులు ఎక్కడివంటే**

కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అందించే పరిహారాలు గాని, సహాయంగాని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఖజానాలకు ఏమాత్రం సంబంధం లేదు. రూ.10 లక్షల నిర్మాణ వ్యయం దాటిన భవనాల నుంచి 1 శాతం లేబర్ సెస్ పేరుతో బిల్డింగు ప్లాన్ అప్రూవల్ చేసే ముందే సంక్షేమ బోర్డుకు భవన యజమానులు చెల్లించాలి. కార్మికులు పేర్లు నమోదు చేసుకునేటప్పుడు నెలకి రూపాయి చొప్పున ఐదు సంవత్సరాలకి రూ.60 సంక్షేమ బోర్డుకు జమ చేయాలి. యజమానులు కార్మికులు చెల్లించిన నిధుల నుంచి సంక్షేమ బోర్డు ద్వారా ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుల కుటుంబాలకు, అవసరంలో ఉన్న కార్మికులకు ఆదుకునేందుకు ఉపయోగించాలని 1996 అసంఘటితరంగ కార్మికుల సంక్షేమ చట్టం ద్వారా 2009లో ఏపి భవన ఇతర కార్మికుల సంక్షేమ బోర్డును అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి వేల మంది కార్మికుల కుటుంబాలకు ఈ సంక్షేమ బోర్డు పరిహారాలు ఆసరాగా ఉండేవి. ప్రతి సంవత్సరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగే ప్రాజెక్టు నిర్మాణాలు, భవన నిర్మాణాల నుంచి రూ.300 కోట్ల పైబడి సెస్సు వసూలు జరిగేది.

**అగమ్యగోచరంగా కార్మికుల పరిస్థితి**

జగన్ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికులు అన్ని విధాల నష్టపోయారు. ఇసుక ధర అమాంతం పెరిగిపోయి నిర్మాణరంగం కుదేలై రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ రంగంపై ఆధారపడి జీవించే 25 లక్షల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మరోవైపు ఉపాధిలేక ఉన్న కార్మికులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు పథకాలు నిలుపుదల చేయడంతో దిక్కుతోచని పరిస్థితికి కార్మికులు నెట్టబడ్డారు. ఈ ఉక్కిరి బిక్కిరి పరిస్థితుల నుంచి బయటపడే మార్గం ఎన్నికల్లో జగన్‌ని ఓడించడం ద్వారా మాత్రమే సాధ్యమని కార్మికులు నమ్మి కూటమి ప్రభుత్వానికి కార్మికులు ఓటు వేశారు. అయితే ఉచిత ఇసుక పాలసీ కార్మికులకు భారంగా మారింది. ఉపాధికి దూరమయ్యారు.

### కూటమి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు

జగన్ ప్రభుత్వం సంక్షేమ బోర్డు పథకాలను నిలుపుదల చేస్తూ ఇచ్చిన 1214 మెమో సర్క్యులర్‌ను తక్షణం రద్దుచేసి సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి. 2019 నుండి 24 వరకు పెండింగ్‌లో ఉన్న కార్మికుల పరిహారాలను తక్షణం చెల్లించాలి. సంక్షేమ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికుల కోసం మాత్రమే ఖర్చు చేయాలి. ఇసుకను బ్లాక్ మార్కెట్ చేసి అమ్మే దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిర్మాణ సామాగ్రి ధరలను తగ్గించడం ద్వారా నిర్మాణ రంగానికి పూర్వ వైభవం తీసుకురావాలి.

**సిహెచ్. రాజకుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి**




బకాయి వేతనాల చెల్లించాలని నినాదాలు చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

## 3 నెలల వేతన బకాయిలు చెల్లించాలి

### ఎంహెచ్ఓ కార్యాలయం వద్ద క్లాప్ డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

మూడు నెలల బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం నుంచి విధులు బహిష్కరించిన నగర పాలక సంస్థ క్లాప్ డ్రైవర్లు రెండో రోజైన శనివారం తమ పోరాటాన్ని కొనసాగించారు. ఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జీ, సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడారు. నగరంలో తడి, పొడి చెత్త సేకరణ చేసే వాహనాలు రెండు రోజుల నుంచి ఆగిపోయినా మున్సిపల్ అధికారుల నుంచి ఏ విధమైన స్పందన లేకపోవడం దారుణమని అన్నారు. తక్షణమే క్లాప్ వాహన డ్రైవర్స్‌కి 3 నెలల బకాయి జీతాలు చెల్లించాలని, ఏడాది కాలంగా కార్మికుల జీతాల నుంచి కట్ చేసుకున్న పీఎఫ్ సొమ్మును కార్మికుల ఖాతాకు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, కనీస వేతనం రూ.24500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం రూ.12 వేలతో కుటుంబాలు నెట్టుకొస్తున్న క్లాప్ వాహన డ్రైవర్లకు గత 3 నెలలుగా జీతాలు చెల్లించకపోతే వారి కుటుంబాల జీవనం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల రేట్లు రోజురోజుకూ పెరిగిపోతున్న తరుణంలో కనీస వేతనాలు అమలు చేయడానికి అధికారులు చొరవ చూపాలని కోరారు. సంవత్సరాల తరబడి మున్సిపాలిటీ పరిధిలో క్లాప్ వాహన డ్రైవర్లుగా పనిచేస్తున్నా కనీసం గుర్తింపు కార్డులు కూడా మున్సిపల్ అధికారులు ఇవ్వడం లేదన్నారు. క్లాప్ వాహన డ్రైవర్ల సమస్యల పట్ల మున్సిపల్ అధికారులు చొరవ చూపకపోతే సోమవారం నుంచి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్లాప్ వాహన డ్రైవర్ల యూనియన్ నాయకులు సంతోష్, ఇస్మాయిల్, గంగాధర్, దుర్గాప్రసాద్, కృష్ణమూర్తి, రాజు, కె.రాము, డి.వీరబాబు, శివ, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

## మద్యం షాపు నిర్మాణాన్ని అడ్డుకున్న మహిళలు

ప్రజాశక్తి - కోటనందూరు

తుని రూరల్ డి.పోలవరం పంచాయతీ శివారు నందివంపు గ్రామంలో నిర్మిస్తున్న మద్యం షాపు నిర్మాణాన్ని స్థానిక మహిళలు అడ్డుకున్నారు. దీంతో నిర్వాహకులకు, మహిళలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మద్యం షాపు ఏర్పాటు చేస్తున్న రోడ్డు మీదుగానే విద్యార్థినీ, విద్యార్థులు వెళ్తారని, మద్యం తాగిన మైకంలో వారిని ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందని, కావున తమ గ్రామ పరిధిలో మద్యం షాపును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమని మహిళలు స్పష్టం చేశారు. అలాగే కొలిమీరు గ్రామంలో నిర్మాణం చేస్తున్న మద్యం షాపును గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకూ, గ్రామస్తులకు మధ్య శుక్రవారం రాత్రి తోపులాట వరకూ దారి తీసింది. ప్రభుత్వం విధించిన నిబంధనలకు విరుద్ధంగా షాపులను ఏర్పాటు చేస్తున్నారని, వీటిపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమం చేపడతామని ఆయా గ్రామాల మహిళలు హెచ్చరించారు.



మద్యం షాపు పునాదుల్లో రాళ్లు వేస్తున్న మహిళలు

## కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని లంపకలోవలో శని వారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మాజీ సర్పంచ్ గంటా సత్యనారాయణ 5వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి ముందుగా సత్యనారాయణ విగ్రహానికి గ్రామ పెద్దలు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 30 మందిని కంటి ఆపరేషన్ చేయించడానికి కాకినాడ తీసుకు వెళ్లినట్లు శిబిరం నిర్వాహకులు గొంతిన సురేష్ తెలిపారు. డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రతి 6 నెలలకు ఒకసారి డయాబెటిక్, బీపీ ఉన్న రోగులు కళ్ళ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. నిర్వాహకులు సురేష్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఏడాది నిర్వహించే వైద్య శిబిరానికి సహకారాన్ని అందిస్తున్న కాకినాడ అంజు ఆసుపత్రి వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు గంటా మహాలక్ష్మిరావు, గంటా నాగేశ్వరరావు, పంది బూరయ్య, గీసాల రాజబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

## మార్చి నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో గృహ నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో హౌసింగ్, ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులు, ఇతర అంశాలపై వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, ఎపిడి, ఎపిఒ, డిఇ, ఇఇలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో హౌసింగ్ అధికారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఇంటి పనులు ప్రారంభించిన ప్రతిచోట తప్పనిసరిగా మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి స్టేజ్ కన్వర్షన్ జరిగేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సిసి రోడ్ల పనుల్లో పురోగతి కనబరచాలన్నారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని వెల్ఫేర్ అసిస్టెంట్లు సక్రమంగా నాణ్యతను తనిఖీ చేసి వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలో ఈ నెల 25 నుంచి ప్రారంభమైన పశుగణన ప్రక్రియ సజావుగా సాగేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ ఎన్‌వివి. సత్యనారాయణ, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, డిపిఒ వి.రవికుమార్, సిపిఒ పి.త్రినాథ్, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

## జాతీయ స్థాయి పోటీలకు గొల్లపాలెం విద్యార్థి

ప్రజాశక్తి - కాజులూరు

జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు మండలంలోని గొల్లపాలెం జడ్‌పి పాఠశాల విద్యార్థి రోహిత్ ఎంపికయ్యాడని పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎస్‌వి సుశీలమణి తెలిపారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. శ్రీ నగర్‌లో నవంబర్ 6 నుంచి జరిగే సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకి తమ పాఠశాల విద్యార్థి ఎంపిక కావడం సంతోషకరమన్నారు. గత సెప్టెంబర్‌లో అనంతపురంలో జరిగిన రాష్ట్ర సెలక్షన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడని పీడీ జి.సునీల్ కుమార్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన రోహిత్‌ని సర్పంచ్ పి.ప్రసన్న మౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరి, ఎంపిటిసి సభ్యురాలు జొన్నకూటి సత్యపద్మజ, ఎస్ఎంసి ఛైర్మన్ కొలిశెట్టి సత్యం, గ్రామ పెద్దలు నున్న కాశి, చంద్రు వీర్రాజుచౌదరి, దేగల సతీష్, గుబ్బల యేసురాజు, తాడి వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.



రోహిత్

## ఆలయానికి రూ.2.32 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.2.32 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,48,350, అన్నదాన విరాళాల ద్వారా రూ.52,803, కేశఖండన ద్వారా రూ.6,120, తులాభారం ద్వారా రూ.450, లడ్డు ప్రసాదం ద్వారా రూ.24,630 మొత్తం రూ.2,32,353 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు సేవలందించారు.



అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

## టోర్నమెంట్ విజేతగా ఐడియల్ డిగ్రీ కళాశాల

ప్రజాశక్తి - కాకినాడ

నన్నయ్య యూనివర్సిటీ పరిధిలో జరిగిన అంతర్ కళాశాలల కబడ్డీ టోర్నమెంట్ విజేతగా కాకినాడ ఐడియల్ డిగ్రీ కళాశాల విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినికుమారి మాట్లాడుతూ క్రీడలకు ఐడియల్ కళాశాల పుట్టినిల్లు వంటిదని, విద్యతో పాటు క్రీడలకు ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. కళాశాల వ్యాయామ అధ్యాపకులు పి.శ్రీను మాట్లాడుతూ ఫైనల్ బీకాం విద్యార్థులు దుర్గాప్రశాంత్, హరీష్, శ్రీహరి, సెకండ్ బిఎ విద్యార్థి సూర్యచంద్ర అక్టోబర్ 30 నుంచి నవంబర్ 3 వరకూ జరిగే సౌత్ ఇండియా అంతర్ కళాశాలల కబడ్డీ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ టి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.స్టీవెన్‌రాజు, అకాడమిక్ డైరెక్టర్ ఎం.రంజిత్, కామరాజు, డిపిఎస్ కిరణ్, వి నాగేశ్వరావు, డాక్టర్ కె.స్వామీజీ, తదితరులు క్రీడాకారులను అభినందించారు.



విజేతలను అభినందిస్తున్న చిరంజీవినికుమారి

## ఆత్మహత్యాయత్నానికి కారకులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ సునీత ఆత్మహత్యాయత్నానికి కారకులను అరెస్టు చేయాలని సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షులు జి.బేబీరాణి, సిఐటియు కాకినాడ నగర కన్వీనర్ మలక వెంకటరమణ డిమాండ్ చేశారు. కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న సునీతను శనివారం వారు పరామర్శించారు. సునీత ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కరప మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన పులపకోరి సునీత ఫీల్డ్ అసిస్టెంట్‌గా 15 ఏళ్లకు పైబడి పని చేస్తూ ఉంటే ఆమెను కాదని, మరొక వ్యక్తిని ఫీల్డ్ అసిస్టెంట్ గా నియమించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకులు ఆమెపై ఒత్తిడి తీసుకొచ్చి వేరే ఆమెను ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించడానికి ప్రయత్నించారని అన్నారు. సునీత ఒప్పుకోకపోతే బెదిరింపులు కూడా చేశారన్నారు. మరోపక్క తప్పుడు ఆరోపణలు చూపించి ఈమెను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అందుకు మనస్తాపానికి గురియైన సునీత పాయిజన్ తీసుకుందన్నారు. ఈ పాయిజన్ తీసుకోవడానికి కారకులైన నాయకులపై, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు అందరినీ ఐక్యం చేసి పోరాటం చేస్తామన్నారు.



బాధితురాలితో మాట్లాడుతున్న బేబీరాణి

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు


ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట గాంధీ బొమ్మ సెంటర్ నుంచి రైల్వే గేటు మీదుగా కాకినాడ రోడ్లోకి నాలుగు చక్రాలు వాహనాలతోపాటు ఆటోలు, కార్లు వెళ్లకుండా ట్రాఫిక్ పోలీసులు రెడ్ సిగ్నల్ వేశారు. ఎల్‌సి గేట్ దగ్గర ప్రతిరోజు ట్రాఫిక్‌తో సామర్లకోట - కాకినాడ, సామర్లకోట కెనాల్ రోడ్‌లో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్న క్రమంలో ఆ సమస్యకు మోక్షం కల్పిస్తూ డిఎస్‌పి ఆదేశాలతో సిఐ ఎ.కృష్ణభగవాన్ సూచనలతో ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, సిబ్బందితో గాంధీ బొమ్మ వద్ద రోడ్డుకు అడ్డుగా సెంటర్ వద్ద ఐరన్ పోల్స్ ఏర్పాటు చేశారు. కేవలం ద్విచక్ర వాహనాలు, పశువులు రాకపోకలు జరిగేవిధంగా ఇనుప రాడ్లు ఏర్పాటు చేశారు. రైలు గేటులో ట్రాఫిక్ ఇబ్బందులకు పరిష్కారం చూపుతూ పోలీసులు తీసుకున్న చర్యలను పలువురు అభినందించారు.



ఇనుప స్తంభాలను వేయిస్తున్న పోలీసులు

## కార్టూ'నిజం'



# పొంచి ఉన్న ప్రమాదం..!

**-ఒరిగిపోతున్న విద్యుత్ స్తంభాలు**

**-పట్టించుకోని అధికారులు**

ప్రజాశక్తి - కరప

మండలంలోని నడకుదురు గ్రామంలో ప్రమాదం విద్యుత్ స్తంభాల రూపంలో పొంచివుంది. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ఎప్పుడు ఎటువంటి ప్రమాదాన్ని చవిచూడాల్సివస్తుందోనన్న భయాందోళనలో ప్రజలు జీవిస్తున్నారు. గ్రామంలోని రామలింగేశ్వర కాలనీకి వెళ్లే దారిలోని మూడు స్తంభాలు గత 4 నెలలుగా పక్కకి ఒరిగిపోయి ఉన్నాయి. ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాల ద్వారానే విద్యుత్ సరఫరా జరుగుతోంది. దీంతో ఆ మార్గంలో వెళ్లాలంటే ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఏ సమయంలో ఒరిగిన స్తంభాలు కిందకు పడిపోతాయో తెలియని అయోమయ స్థితిలో ప్రజలు ఉన్నారు. ఒరిగిన స్తంభాలకు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఈ నెల 28వ తేదీన కలెక్టరేట్‌లో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు గ్రామస్తులు సిద్ధం అవుతున్నారని స్థానికులు ఎన్.దుర్గాప్రసాద్ తెలిపారు.



నడకుదురులో ఒకపక్కకు ఒరిగిపోతున్న విద్యుత్ స్తంభం




సదస్సులో మాట్లాడుతున్న రత్నాకరరావు

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించాలి

ప్రజాశక్తి - గండేపల్లి

భవిష్యత్ అంతా ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్‌పై ఆధారపడి ఉందని, కావున విద్యార్థులు ఎఐపై పట్టు సాధించాలని బెంగళూరు సాంసంగ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ ఆర్‌వి. రత్నాకర్‌రావు అన్నారు. ఆదిత్య యూనివర్సిటీ ఐటీ విభాగంలో శనివారం 'ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్ ఇన్ ఇండస్ట్రీ' అనే అంశంపై అతిథి ఉపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే కాలమంతా ఎఐదేనని, ప్రపంచాన్ని శాసించే శక్తిగా ఈ విభాగం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు ఈ విభాగంపై పట్టు సాధించడం ద్వారా ఉన్నత కొలువులు సాధించవచ్చునని తెలిపారు. 5 రోజులపాటు జరిగిన వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసిందని విభాగాధిపతి డాక్టర్ ఎం.వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి, ప్రో వైస్ ఛాన్సలర్ (అకడమిక్స్) డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, ఐటీ విభాగాధిపతి డాక్టర్ ఎం.రాజబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాలంటీర్ల ధర్నా కోసం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వాలంటర్లీను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఈనెల 28న కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాను వాలంటీర్లు విజయవంతం చేయాలని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తక్షణమే వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు ఎం.సతీష్‌కుమార్, పి.భవాని, వి.ప్రశాంతి, వి.దొర, పి.జ్యోతి, కె.ఆనంద్, ఎం.ఈశ్వరి పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వాలంటీర్లు

# నేరాలు ఘోరాలు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**ప్రజాశక్తి - రాజానగరం**

మండలంలోని తూర్పుగోనగూడెం జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రాజమహేంద్రవరం నుంచి మురారి వైపు వెళుతున్న ఐచర్ వ్యాన్ జాతీయ రహదారి ఐఎస్‌టిఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల దాటిన తర్వాత జంక్షన్‌లో తిరిగి రాజమహేంద్రవరం వైపునకు యూటర్న్ తీసుకున్నాడు. ఈలోగా గండేపల్లి వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కారు ఐచర్ వ్యాన్‌ను వేగంగా ఢీ కొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న మాట్టే వెంకటరమణ(26) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రాజమహేం ద్రవరం చెందిన వాడుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

**ప్రజాశక్తి - గండేపల్లి, తాళ్లరేవు**

గండేపల్లి మండలంలోని తాళ్లూరు గ్రామ శివారున శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయాలపాలయ్యాడు. హైవే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తునికి చెందిన కె.సత్యనారాయణ ద్విచక్రవాహనంపై రాజమహేంద్రవరం వెళ్తుండగా తాళ్లూరు శివారున ఉన్న డివైడర్ వద్ద లారీ యూ టర్న్ తీసుకునే క్రమంలో లారీని ఢీకొట్టి డివైడర్‌పై పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. హైవే పోలీసులకు సమాచారం రావడంతో వారు హుటాహుటీన సంఘటనా ప్రాంతానికి వచ్చి క్షతగాత్రుడిని రాజానగరం జిఎస్ఎల్ ఆసుపత్రికి 108లో తరలించారు.అలాగే తాళ్లరేవు సూర్య హాస్పిటల్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు.కోరంగి ఎస్ఐ పి.సత్య నారాయణ శని వారం తెలిపిన వివరాల మేరకు.. హాస్పిటల్ పక్కన ఉన్న ఐస్ ఫ్యాక్టరీ నుంచి ఖాళీ కంటైనర్ లారీ వేగంగా రోడ్డుపైకి రావడంతో యానాం నుంచి మోటార్ సైకిల్‌పై పెద్దాపురం వెళ్తున్న వ్యక్తులు కంటైనర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో పెద్దాపురంకు చెందిన బుర్ర అనిల్‌కు తీవ్ర గాయాలు కాగా, మేక రాజేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అగ్ని ప్రమాదంలో వృద్ధురాలి మృతి

**ప్రజాశక్తి - పెద్దాపురం**

స్థానిక జగ్గంపేట రోడ్డులోని రాజీవ్ కాలనీలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకు ఇళ్లు దగ్ధం అయింది. అగ్నిప్రమాదం వార్త తెలిసిన వెంటనే అగ్నిమాపక అధికారి శ్రీహరి జగన్నాథ్ ఆధ్వ ర్యంలో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటీన సంఘ టన ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అనంతరం గుడిసె లోపల పరిశీలించగా కనకాల బూరమ్మ(75) తీవ్రగాయాలతో పడి ఉన్నట్లు గుర్తిం చారు. ఆమెను బయటకు తీసుకొచ్చి పరిశీలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు అగ్నిమాపక సిబ్బంది గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ మౌనిక తెలిపారు.

## బాణసంచా తయారీ కేంద్రాలపై పోలీసుల దాడి

**ప్రజాశక్తి - పెద్దాపురం, కరప**

పెద్దాపురం పట్టణ శివారు పాండవుల మెట్ట సమీపంలో ఒక ఇంటిలో ఎటువంటి అనుమతులు లేకుండా బాణాసంచా తయారు చేస్తున్నట్లు సమాచారం తెలుసుకుని ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు రూ.15 వేలు విలువ చేసే మతాబాలు, టపాసులు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే కరప మండలం గొర్రిపూడి గ్రామంలోని అనుమతులు లేకుండా తయారు చేస్తున్న బాణాసంచాను సీజ్ చేసినట్లు కరప ఎస్ఐ సునీత తెలిపారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేస్తున్న గండి దుర్గాప్రసాద్ అను వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద అనధికారకంగా కలిగి ఉన్న మందు గుండు సామాగ్రిని సీజ్ చేశారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# ధరలు భగ భగ... దీపావళి వెలుగులు వెల వెల

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి**

చుక్కలనంటుతున్న ధరలు సామాన్యులకు దీపావళి కాంతులను దూరం చేసేలా మారాయి. ఒక వైపుకూరగాయల ధరలు... మరో వైపు నిత్యావసర సరుకుల ధరలు కొనుగోలు దారులకు చుక్కలు చూపిస్తున్నాయి. కిలో టమోటా రూ.80కి చేరిన విషయం విదితమే. ప్రభుత్వం రైతు బజార్లలో రూ.50కే కేజీ అంటూ చేసిన ఆర్భాటపు ప్రచారాలు నేతి బీర చందంగా మారాయి. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో సైతం ప్రారంభించిన రెండో రోజు నుంచే అత్యధిక రైతు బజార్లలో సబ్సిడీ టమోటాలు పరిమితంగా విక్రయాలుజరుగుతున్నాయి. దీంతో కొనుగోలు దారులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నారు. చిక్కుడు కాయలు సైతం కిలో రూ.100 మార్కు దిగిరానంటున్నాయి. ఇతర కూరగాయలు సైతం కిలో రూ.50 పైమాటే. ఇపుడే ధరలు ఇలా ఉంటే కార్తీక మాసంలో చుక్కలనంటుతాయనే ఆందోళన కొనుగోలుదారులలో వ్యక్తమవుతోంది. మరోవైపు సన్న బియ్యం ధరలూ రూ.70లకు చేరాయి. ఇక పిండివంటల సంగతి సరేసరి. మినపప్పు, వంటనూనెలు, ఇతరత్రా వంట సామగ్రి సైతం చుక్కలనంటుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉచిత గ్యాస్ పథకం అమలుకు రంగం సిద్ధం చేయటం కొంత ఆశాజనకమైన పరిస్థితులున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఎంతమందికి వర్తింస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**నూతన మద్యం పాలసీలో మందుబాబుల జేబులకు చిల్లు**

కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన మద్యం పాలసీ మందుబాబులకు చిల్లుపెడుతోంది. జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ వైన్ షాపులు ఏర్పాటైన విషయం విదితమే. అయితే కేవలం ప్రారంభమైన 10 రోజులకే నిర్వాహకులు నిబంధనలకు నీళ్లొదిలేశారనే ఆందోళన వ్యక్తమవుతోంది. అత్యధిక వైన్ షాపులలో ఎంఆర్‌పి ధరలకు అదనంగా రూ.20 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. సమయ పాలన గాడి తప్పడంతో బార్ అండ్ రెస్టారెంట్‌ల ఆదాయానికిగండి పడింది. దీంతో అనివార్యంగా బార్ రెస్టారెంట్‌ల నిర్వకులు అనివార్యంగా ధరలు తగ్గించారు. ఓ వైపు బార్ అండ్ రెస్టారెంట్లు మరోవైపు వైన్ షాపులు పోటీ పడి మందుబాబులను ఆకర్షించడం విస్తుగొలుపుతోంది. అనేక ప్రజాకర్షణ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆచరణలో ఒకొక్కటి విఫలమవటం విమర్శలకు దారి తీస్తోంది. ఉచిత ఇసుక విధానం ఒక ఉదాహరణగా నిలుస్తోంది. భవన నిర్మాణ రంగంలో పనిచేసే 26 రంగాల కార్మికులకు ఇప్పటికీ పూర్తి




స్థాయిలో ఉపాధి లభించకపోవటానికి ఇసుక కొరతే ప్రధాన కారణమవుతోంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ప్రజల ఉపాధి అవకాశాలపై దృష్టిపెట్టాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

**ఫీవర్ ఫియర్**

జిల్లాలో సీజనల్ జ్వరాలు, ఇతర ఇన్‌ఫెక్షన్‌లు పడగ విప్పుతున్నాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో దోమలు విజృంభించటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గత వారం రోజులలో ఉమ్మడి జిల్లా కేంద్రాలలోని ప్రభుత్వ ఆస్పత్రులు కిట కిటలాడుతున్నాయి. పల్లెల్లో వైద్య సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవటంతో రోగులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దీంతో రక రకాల పరీక్షల పేరుతో ప్రైవేటు ఆస్పత్రుల యాజామాన్యాలు సామాన్యుల జేబులకు చిల్లుపెడుతున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం జ్వరాల నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని ప్రజలతో పాటు ఆరోగ్య శాఖ సిబ్బంది సైతం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యం చేరువ చేయటంతో పాటు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**విద్యుత్ వినియోగదారులకు షాక్**

విద్యుత్ వినియోగదారులకు నూతన ప్రభుత్వం షాకిచ్చేందుకు సిద్ధమైంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వేస్తున్న అడుగులు సామాన్యుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ఒక ప్రవేట్ ఏజెన్సీ రాజమహేంద్రవరంలో ఇంటర్వ్యూలుసైతం నిర్వహించింది. ఈ ఇంటర్వ్యూలకు వేలాది మంది అభ్యర్థులు క్యూ కట్టారు. అయితే విద్యుత్ శాఖ పర్యవేక్షణలో వీరంతా విధులు నిర్వహిస్తారని సమాచారం. డిసెంబరు నుంచే స్మార్ట్ మీటర్‌ల ఏర్పాటు చేస్తే ఇక ప్రి పెయిడ్ కరెంటు వాడాల్సిందే. తొలుత నగదు చెల్లించి ఆపై విద్యుత్ వినియోగించే పరిస్థితులు దుస్థితి రానుందనే ఆందోళన వినియోగదారుల్లో వ్యక్తమవుతోంది.

## పలు కుటుంబాలకు ముద్రగడ పరామర్శ

**ప్రజాశక్తి - ప్రత్తిపాడు**


రాచపల్లి గ్రామంలో పర్యటిస్తున్న ముద్రగడ

మండలంలోని రాచపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ మంత్రి, వైసిపి నాయకులు ముద్రగడ పద్మనాభం పరామర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలు మా కుటుంబాన్ని ఎంతో ఆదరించారని అన్నారు. ఆ ప్రజల రుణం తీర్చుకోలేనని తెలిపారు. తనకు అండగా నిలిచిన ప్రజలు కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని అన్నారు. ఈ పర్యటనలో గణేశుల రాంబాబు, గౌతు స్వామి, వైస్ ఎంపిపి బంకు శ్రీను, సర్పంచ్ సారిపల్లి రామలక్ష్మి, గంగరాజు, వెంకట రాజా పాల్గొన్నారు.

## సేవలతోనే తగిన గుర్తింపు

**ప్రజాశక్తి - కాజులూరు**

ప్రజలకు అందించిన సేవలతోనే తగిన గుర్తింపు లభిస్తుందని గొల్లపాలెం సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక అన్నారు. శనివారం గొల్లపాలెం సచివాలయం ఆవరణలో బదిలీపై వెళ్లిన విఆర్ఓ ఈశ్వరరావును సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందించిన సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఆర్ఓ ఈశ్వరరావు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరి, విఆర్ఓ శ్రీనివాస్, స్థానిక నాయకులు గుబ్బల యేసురాజు, తాడి వెంకటరెడ్డి, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఓపెన్ హౌస్‌తో అవగాహన

**ప్రజాశక్తి - గండేపల్లి**

స్థానిక పోలీస్ స్టేషన్లో విద్యార్థులకు పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్ఐ శివనాగబాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ శాఖలో అమలౌతున్న ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం గురించి, రిసెప్షన్ విధులు, ఫింగర్ ప్రింట్, బ్లూ కోల్ట్, డయల్ 100, షీ టీం భరోసా సెంటర్, గంజాయి కిట్ పని తీరు, పోలీస్ శాఖలో ఉపయోగిసస్తున్న ఆయుధాలు, పోలీస్ రికార్డ్స్, పోలీస్ స్టేషన్ పని తీరుపై ఎఎస్ఐ బి.చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాశక్తి - కాకినాడ**

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్‌పై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను సమీక్షించారు. ఇప్పటివరకూ పరిష్కరించిన దరఖాస్తులు, పరిష్కరించినవి సంతృప్తికరంగా ఉన్నయా? లేవా? ఇంకా ఎన్ని అర్జీలను పరిష్కరించాలి, పరిష్కరించక పోవడానికి గల కారణాలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ఈ సమావేశం ప్రతి వారము నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రతి ఒక్క ఫిర్యాదును పరిశీలించడం జరుగుతుందనితెలిపారు. ఈ సమావేశాంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 28న విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి - పెద్దాపురం**

మండలంలోని మరలావ 11 కెవి ఫీడర్‌పై చేపట్టే మరమ్మతుల కారణంగా ఈ నెల 28వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎస్‌డిఎస్.ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల 33/11 దివిలి సబ్‌స్టేషన్ పరిధిలోని చదలాడ, ఉలిమేశ్వరం, కాండ్రకోట, గుడివాడ, సిరివాడ, మరలావ, తూర్పుపాకలు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, దీనిని విద్యుత్తు వినియోగదారులు గమనించాలన్నారు.

# కొనసాగుతున్న రీ సర్వే గ్రామ సభలు

**భూ రికార్డుల్లో జరిగిన లోపాలను సరిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే గ్రామ సభలు కొనసాగుతున్నాయి. శనివారం జిల్లాలోని పలు మండలాలకు చెందిన గ్రామాల్లో గ్రామ సభలు జరిగాయి.**

**ప్రజాశక్తి - యంత్రాంగం**



కరప మండలం కూరాడలో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతున్న తహశీల్దార్

**కరప** మండలంలోని కూరాడ శివారు చిన్నమామిడాడలో రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. ఈ సభలో తహశీల్దార్ ఎస్.సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. గతంలో చేసిన రీ సర్వేలో రెవెన్యూ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొత్త పాస్ పుస్తకాలకు, ఇతర రెవెన్యూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. గ్రామ సభలో 81 అర్జీలు వచ్చాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డిటి దుర్గాప్రసాద్, ఆర్ఐ పవన్, మండల సర్వేయర్ ఎస్.రూపవతి, గ్రామ సర్పంచ్ రావుల సూర్యచంద్రావతి, ఎంపిటిసి సభ్యులు గుత్తుల శాంతి, మాజీ ఎంపిటిసి సభ్యులు పితాని జయరామకృష్ణ, వెలుగుబంట్ల సూరిబాబు, వెలుగుబంట్ల శ్రీకృష్ణ, గోవిందరాజులు పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలోని యర్రంపాలెంలో నిర్వహించిన రీ సర్వే గ్రామ సభలో తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సభలో భూయజమానులు, ప్రజా ప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వివిధ సమస్యలకు సంబంధించి 33 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ వై.వంశీకృష్ణ, గ్రామ సర్వేయర్లు, విఆర్ఒలు, పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని ఉప్పంగలలో తహశీల్దార్ పి.త్రినాథరావు అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. శుక్ర, శనివారాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో 143 దరఖాస్తులు వచ్చాయనీ డిప్యూటీ తహశీల్దార్ సూరిబాబు తెలిపారు. ఈ గ్రామ సభలో సర్పంచ్ శాఖ శంకరుడు, దవులూరి శ్రీరామచంద్రమూర్తి, ఉంగరాల వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ సఫీ పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని దివిలి పంచాయితీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామ సభలో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ప్రజల నుంచి పలు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేష్, మండల సర్వేయర్ సామోరు, పంచాయితీ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని ఉండూరు సచివాలయం వద్ద జరిగిన మాధవపట్నం గ్రామ సభలో 21 అర్జీలు వచ్చాయి. శనివారం సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాస్, మండల సర్వేయర్ పి. సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు, విఆర్ఒలు పాల్గొన్నారు.


తాళ్లరేవు మండలం ఉప్పంగలలో జరుగుతున్న గ్రామ సభ

# సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా


**జిల్లాలోని పలు గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు.**

**ప్రజాశక్తి - యంత్రాంగం**

**ఏలేశ్వరం** స్థానిక టిడిపి కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణ స్వామి మాట్లాడుతూ ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ ఆదేశాలతో సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఛైర్మన్లు వాగు రాజేష్, జొన్నాడ వీరబాబు, కౌన్సిలర్లు ఎండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, పెంద్ర శ్రీను పార్టీ పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** మండలంలో రూరల్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి స్వగృహంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు ప్రచార వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు. రమణయ్యపేట, గైగోలు పాడు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి టిడిపి సభ్యత్వ నమోదు ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కాకినాడ** నగరంలోని 6, 30 డివిజన్లలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎంఎల్ఎ వనమాడి కొండబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ టిడిపికి కార్యకర్తలే బలమన్నారు. సభ్యత్వాల ద్వారా ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేందుకు దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, నాయకులు గ్రంధి నారాయణరావు బాబ్జి, బచ్చు శేఖర్, పోలుపల్లి జగన్, బుంగా నాగరాజు, గదుల సాయిబాబా, అంబటి చిన్న, ఓమ్మి బాలాజీ తుమ్మల రమేష్ పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని సలపాకలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల టిడిపి అధ్యక్షుడు పేపకాయల నారాయణరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతు గనిరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వనం వీరబ్రహ్మం, చంద్రు వీర్రాజు చౌదరి, మండల బీసీ సెల్ అధ్యక్షులు వల్లు అర్జున్ రావు, మాజీ సర్పంచ్ పోతురాజు భీమారావు, గ్రామ అధ్యక్షులు పితాని సూరశ్రీను పాల్గొన్నారు.

# ఘనంగా సోమసుందర్ జయంతి వేడుకలు

**ప్రజాశక్తి - కాకినాడ**


సోమసుందర్‌కు నివాళులర్పిస్తున్న కవులు

సాహిత్య అకాడమీ, క్రియ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో 'వజ్రయుధ కవి' అవంత్స సోమసుందర్ జయంతి వేడుకలు కాకినాడ గాంధీ భవన్‌లో శనివారం ఘనంగా జరిగాయి. తెలుగు సలహా సంఘం, సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ సి.మృణాళిని ప్రారంభ ఉపన్యాసంలో మాట్లాడుతూ సోమసుందర్ 100కి పైగా పుస్తకాలు రాశారని, కవిత్వం, కథ, విమర్శ, వ్యాసాలు, మోనోగ్రాఫ్ వంటి ప్రక్రియలలో కృషి చేశారని కొనియాడారు. సోమసుందర్ సాహిత్య కృషిని కొత్త తరానికి పరిచయం చేయడానికి శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రముఖ కవి నందిని సిధారెడ్డి మాట్లాడుతూ పిఠాపురంలో నివసించిన సోమసుందర్ నిజాం పాలకులని ఎదిరిస్తూ విలువరించిన గేయకావ్యం 'వజ్రాయుధం' నాటి తెలంగాణ పరిస్థితులని కళ్ళకి కట్టిందన్నారు. క్రియ సొసైటీ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాధరావు మాట్లాడారు. సోమసుందర్ కవిత్వంపై జరిగిన జి.సీతారామస్వామి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎన్.ఈశ్వర రెడ్డి, బొల్లోజు బాబా, వాడ్రేవు వీరలక్ష్మిదేవి, చందు సుబ్బారావు, సాహిత్యంపై జరిగిన సమావేశంలో కస్తూరి నాగ మురళీ శంకర్, నండూరి రాజగోపాల్, ఆర్. సీతారామారావు మాట్లాడారు. ముగింపు సమావేశంలో మేకా మన్మధరావు, శిఖామణి ప్రసంగించారు.



# పనుల్లేక పస్తులతో కార్మికులు

- పూట గడవాలంటే అప్పులే
- ఉచిత ఇసుక ఎప్పటికో..?

**ప్రజాశక్తి - పిఠాపురం**



ఇసుక కొరతతో ఉపాధి లేక నిర్మాణ రంగ కార్మికులు పస్తులతో రోజులు గడుపుతున్నారు. పూట గడవాలంటే అప్పులు చేసుకోవాల్సిన దుస్థితిలో కార్మికులు ఉన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుకను సరఫరా చేసి కార్మికులను ఆదుకుంటామని, భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు కొండంత ఆశలు పెట్టుకున్నారు. అధికారంలోకి వచ్చి 5 నెలలు నెలలు గడుస్తున్న నేటికీ ఇసుక సమస్యను పరిష్కరించడంలో, సంక్షేమ బోర్డును పునరుద్ధరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సుమారు 10వేలకు పైబడి తాపీ, కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రిషన్, రాడ్ బైండింగ్, పెయింటర్, సెంట్రింగ్, పునాదులు తీసేవారు, కాంక్రీట్, సీలింగ్, వంటి నిర్మాణ రంగంపైన ఆధార పడి కార్మికులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇసుక సమస్యతో సదరు రంగంపై ఆధారపడి పని చేస్తున్న కార్మికులు తమ ఉపాధిని కోల్పోతున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఇసుక లేక నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోవడం, సంక్షేమ బోర్డు నిధులు ఇతర పథకాలకు మళ్ళించడంతో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నిర్మాణదారులకు ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తే నిర్మాణాలు జరిగి తమ కుటుంబాల పోషణ జరుగుతుందని కార్మికులు భావించారు. కానీ కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇచ్చిన రవాణా ఛార్జీల పేరుతో గతంలో ఉన్న రేట్ల కంటే అధికంగా వసూలు చేస్తుండంతో యజమానులకు భారంగా మారింది. చిన్న చిన్న నిర్మాణదారులు నిర్మాణాలను అర్ధవం తరంగా మధ్యలోనే నిలిపివేస్తున్నారు. ఫలితంగా భవన నిర్మాణ కార్మికులు పస్తులతో గడపాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఇసుక సమస్యతో ఒక పక్క కార్మికుల ఉపాధి కోల్పోతుంటే..మరోపక్క నిర్మా ణాలకు ఉపయోగించే సిమెంట్, ఐరన్, ఎలక్ట్రాకాల్, పెయింట్, ఫర్నిచర్ వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని అమలు చేసి నిర్మాణరంగాన్ని, కార్మికులను ఆదు కోవాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలయ్యేలాగా చూడాలని కార్మికులు కోరుతున్నారు.

### ఉచిత ఇసుక అందుబాటులోకి తేవాలి



ఉచితంగా ఇసుక అందుబాటులోకి తెస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. నేటికీ ఆ హామీ అమలులోకి రాలేదు. ఉచిత ఇసుక అందుబాటులోకి రాకపోవడంతో పనులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలి.

**-దేగల సత్యనారాయణ, తాపీ పనివారల యూనియన్ నాయకులు, పిఠాపురం.**

### భారంగా కుటుంబ పోషణ



ఇసుక లభించక నిర్మాణాలు మధ్యలో ఆగిపోయాయి. నిర్మాణ రంగంలోని ఒక భాగమైన కార్పెంటర్లకు పనులు దొరకడం లేదు. కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. వడ్డీలకు అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తుంది. ఇసుకను అందుబాటులోకి తీసుకువచ్చి కార్పెంటర్లను ఆదుకోవాలి.

**-పి గోవిందాచారి, కార్పెంటర్, పిఠాపురం.**

### ఇసుక లేక పనులు లేవు



ఇసుక లేక నిర్మాణాలు నిలిచిపోయాయి. దానిపై ఆధారపడి జీవిస్తున్న ఎంతో మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఇసుక అందుబాటులోకి వచ్చి నిర్మాణాలు జరిగితేనే నిర్మాణ రంగం మీద ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు కార్మికులకు ఉపాధి లభిస్తుంది. ప్రభుత్వం స్పందించి ఇసుక ఉచితంగా సరఫరా చేయాలి.

**పి.సూర్యచక్రం, ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, పిఠాపురం.**

# సృజనాత్మకతతో వ్యాపార అభివృద్ధి

**ప్రజాశక్తి - పెద్దాపురం**



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

వ్యాపార రంగంలో సృజనాత్మకతను ఆచరించటం ద్వారా వ్యాపార రంగం అభివృద్ధి సాధిస్తుందని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మణిరాజ్ మయార్ అన్నారు. శనివారం స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు నిర్వహించిన దిశ-2024 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యాపార రంగంలో సృజనాత్మకత అనేది ఎవరికి వారు ప్రత్యేకంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. సృజనాత్మకతను పెంపొందించుకున్న వారు కొత్త సామర్థ్యంతో వనరులను సంపదగా తీర్చిదిద్దగలుగుతారన్నారు. సరళ ఫుడ్స్ వ్యవస్థాపక డైరెక్టర్ హనీ అగర్వాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మానసిక సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను సులువుగా పరిష్కరించుకోగలుగుతారన్నారు. ప్రొఫెసర్ సంతానం మాట్లాడుతూ శ్రీ ప్రకాష్ స్కూల్లో మ్యాథ్స్, సైన్స్‌తో పాటు కామర్స్‌కు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పాఠశాల డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ఈ దిశ-2024 కార్యక్రమాన్ని విద్యార్థులే నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం, పాయకరావుపేట, తుని, కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, విజయవాడ పాఠశాలలకు చెందిన చెందిన విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, అర్హతా,( ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎంవివిఎస్.మూర్తి, అకడమిక్ కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై అవగాహన

**ప్రజాశక్తి - గండేపల్లి**

మండలంలోని సూరంపాలెం జడ్‌పి ఉన్నత పాఠశాలలో శనివారం ఆదిత్య యూనివర్సిటీ యూత్ రెడ్ క్రాస్ యూనిట్ మహిళా వాలంటీర్‌ల ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఆడపిల్లలకు సానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రమీల ఆడపిల్లల లైఫ్ స్టైల్, ఆహార పద్ధతుల పై అవగాహన కల్పించారు. ఆడపిల్లల సందేహాలను తీర్చేందుకే ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినటు యూత్ రెడ్ క్రాస్ యూనిట్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ పి.శివకుమార్ తెలిపారు.